ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



విజిలెన్స్ కమిటీ సభ్యుడిగా కృష్ణారావు

ఎచ్చెర్ల, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): పౌరసరఫరాల జాతీయ ఆహార భద్రతా చట్టం -2013లో భాగంగా సామాజిక కార్యకర్తల తరఫున ఎచ్చెర్ల మండలం పొన్నాడ స్పందన స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు పంచిరెడ్డి కృష్ణారావును విజిలెన్స్ కమిటీ సభ్యుడిగా నియమిస్తూ కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఉత్తర్వులు జారీ చేశారు. వినియోగదారులకు నిత్యావసర వస్తువులు రేషన్ డిపోల ద్వారా సక్రమంగా అందేలా విలువైన సలహాలను ఈ కమిటీ సభ్యులు ఇవ్వనున్నారు. తనను సభ్యుడిగా నియమించిన కలెక్టర్‌కు కృష్ణారావు కృతజ్ఞతలు తెలిపారు.



ఆదిత్యుడి ఆలయంలోని క్యూలో కిక్కిరిసిన భక్తులు



ఆదిత్యా.. సమస్యలు తీరేనా?

- అరసవల్లిలో అరకొర సదుపాయాలు
- క్యూలైన్లలో తోపులాటలు
- అపరిశుభ్ర వాతావరణంలో అన్నదానం
- కానరాని ప్లాస్టిక్ నిషేధం
- రథసప్తమికి పరిస్థితిలో మార్పు వచ్చేనా?

శ్రీకాకుళం రూరల్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): అరసవల్లిలో శ్రీసూర్యనారాయణస్వామి దర్శనానికి రాష్ట్రంతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తుంటారు. ఆదివారం నాడు భక్తుల రద్దీ మరింత ఎక్కువగా ఉంటుంది. అయితే ఆలయంలో సౌకర్యాలు లేక భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం నిధులు ఖర్చు చేస్తున్నా పరిస్థితి మాత్రం మారడం లేదు. ముఖ్యంగా క్యూలైన్లపై అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో తోపులాటలు జరుగుతున్నాయి. కొందరు భక్తులు ఫోన్లతో లోపలకు ప్రవేశిస్తున్నారు. అన్నదానం ప్రాంతంలో అపరిశుభ్రత నెలకొంది. నిత్యం ట్రాఫిక్ నిలిచిపోతుంది. ఇలా అనేక సమస్యలు వేధిస్తున్నాయి. వచ్చే నెలలో రథసప్తమి వేడుకలను వారం రోజులపాటు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఈ తరుణంలో క్షేత్రస్థాయిలో భక్తుల ఇబ్బందులను అధికారులు గుర్తించి వాటి పరిష్కారానికి చొరవ చూపాల్సిన ఆవశ్యకత ఉంది.

అంతా అక్కడే..

ఆదిత్యుడి ఉచిత అన్నదాన శిబిరాన్ని అపరిశుభ్ర వాతావరణంలో నిర్వహిస్తున్నారు. భక్తులు భోజనాలు చేసిన తరువాత ఆ పక్కనే తాగడానికి వినియోగించే నీటితో చేతులను శుభ్రపరుచుకోవడం, అక్కడే విస్తరాకులు పడేయడంతో ఆ ప్రాంతంలో అపరిశుభ్రత నెలకొంటోంది. మరుగుదొడ్లు కిలోమీటరు దూరంలో ఉండడంతో అన్నదానం సమీపంలో ఉన్న తెర వెనుకనే భక్తులు ఈ అవసరాలు తీర్చుకోవల్సిన పరిస్థితి నెలకొంది.

- దేవస్థానం ఆవరణలో ప్లాస్టిక్ నిషేధం కేవలం ప్రకటనలకే పరిమితమైంది. పూజా సామగ్రి విక్రయిస్తున్న ప్రతి వర్తకుడు వద్ద ప్లాస్టిక్ కవర్లు ఇబ్బడి ముబ్బడిగా దర్శనమిస్తున్నాయి. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఆలయ పరిసరాలు ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిపోతున్నాయి.
- పుష్కరిణి ఒడ్డున ఉన్న దేవతామూర్తుల విగ్రహాల వద్ద భక్తులు దీపారాధన చేసి నైవేద్యం పెడుతుంటారు. ఒకపక్క వాళ్లు పూజలు చేస్తుండగానే, మరోపక్క పారిశుధ్య సిబ్బంది వచ్చి పూజా ద్రవ్యాల్ని తీసేసి చెత్తబుట్టలోకి పడేయడంపై భక్తులు ఆవేదన చెందుతున్నారు.

యూపీఐ సౌకర్యం కల్పించాలి

ఆలయంలోని కౌంటర్ల వద్ద యూపీఐ సౌకర్యం లేకపోవడంతో భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. దర్శనాలు, ప్రసాదం, కేశఖండన టిక్కెట్లను తీసుకునే కౌంటర్లతో పాటు మొబైల్ ఫోన్లు, బ్యాగులను భద్రపరచుకునే కౌంటర్ల వద్ద నగదు రహిత లావాదేవీలకు అనుమతించడం లేదు. అన్ని కౌంటర్ల వద్ద నగదునే ఇవ్వాల్సి రావడంతో పాటు సరిపడినంత చిల్లర లేకపోవడంతో భక్తులు అసౌకర్యానికి గురవుతున్నారు. అలాగే సింహద్వారం వద్ద ట్రాఫిక్ సమస్య తరచూ సంభవించి (మిగతా 7వ పేజీలో..)

● క్యూలైన్లలో తోపులాట..

మార్గశిర మాసం ఆదివారం కావడంతో భక్తులు స్వామి దర్శనానికి పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఉచిత దర్శనం క్యూలైన్ భక్తులతో కిటకిటలాడింది. మొత్తం ఆరు లైన్లలో ఎక్కడా కూడా సెక్యూరిటీ సిబ్బంది కానీ, పోలీసులు కానీ లేరు. దీంతో క్యూలైన్లలో తోపులాటలు జరగ్గా భక్తులు ఇబ్బందులు పడ్డారు. ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు అవస్థలు పడ్డారు. ఆలయం లోపలకు సెల్‌ఫోన్లు తీసుకెళ్లడం నిషేధం. కానీ క్యూలైన్లలో తనిఖీలు అంతంత మాత్రంగానే ఉండడంతో పలువురు భక్తులు సెల్‌ఫోన్లతో ఆలయంలోకి వెళ్లి స్వామిని దర్శించుకోవడం కనిపించింది. దీంతో ఆలయ భద్రతపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. సెల్‌ఫోన్ల స్థానంలో మారణాయుధాలు ఉంటే పరిస్థితి ఏమిటనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.



దివ్యాంగులకు బ్యాటరీ ట్రైసైకిళ్లను పంపిణీ చేసిన కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు (ఫైల్)

దివ్యాంగుల జీవితాల్లో వెలుగులు

- కేంద్రమంత్రి రామ్మోహన్ కృషితో 'ఏఏఐ' నిధుల వెల్లువ
- రూ.3.21 కోట్లతో అత్యాధునిక పరికరాలు
- విభిన్న ప్రతిభావంతులు, వృద్ధులకు పంపిణీ

శ్రీకాకుళం, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): జిల్లాలో విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధులకు ఆసరాగా నిలిచేందుకుగాను అత్యాధునిక ఉపకరణాల పంపిణీకి భారీగా నిధులు మంజూరయ్యాయి. సాధారణంగా కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ(సీఎస్ఆర్) నిధులు జిల్లాలకు రావడం పరిపాటి. కానీ ఈసారి ఎయిర్ పోర్ట్ అథారిటీస్ ఆఫ్ ఇండియా(ఏఏఐ) ద్వారా జిల్లాకు రికార్డుస్థాయిలో నిధులు మంజూరయ్యాయి. కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు ప్రత్యేక చొరవతో రూ.3.21కోట్ల విలువైన ఉపకరణాలు జిల్లాకు చేరాయి. వీటి ద్వారా 1,238 మంది దివ్యాంగులు, వృద్ధులు, నిస్సహాయులకు లబ్ధి చేకూరనుంది. కొన్నేళ్లుగా సరైన ఆదరణ లేక ఇబ్బంది పడిన దివ్యాంగులకు కూటమి ప్రభుత్వ హయాంలో కొండంత అండ లభించినట్లయింది.

● గత ప్రభుత్వంతో పోలిస్తే భారీ వ్యత్యాసం

గత ప్రభుత్వ హయాంలో(2023-24) 'అలింకో' సంస్థ ద్వారా కేవలం రూ.72.32 లక్షల విలువైన పరికరాలు మాత్రమే పంపిణీకి నోచుకున్నాయి. అప్పటితో పోలిస్తే ప్రస్తుత నిధులు దాదాపు నాలుగు రెట్లు అధికం కావడం విశేషం. ఈ నిధులతో అత్యంత (మిగతా 8వ పేజీలో..)



చంపేస్తున్నారు

- జిల్లాలో పెరుగుతున్న హత్యలు
- వివాహేతర సంబంధాలతోనే అధికం
- ఆస్తులు, బంగారం కోసం సైతం..

రణస్థలం, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): జిల్లాలో హత్యలు పెరుగుతున్నాయి. ఏడాది వ్యవధిలో పదుల సంఖ్యలో హత్యకు గురై ప్రాణాలు కోల్పోయారు. వివాహేతర సంబంధాలు, ఆస్తి గొడవలు, వ్యసనాలకు బానిసై తప్పుదోవపడుతున్న యువత దొంగతనాలకు అలవాటు పడడం వంటి కారణాలతోనే ఎక్కువగా ఈ ఘటనలు జరుగుతున్నాయి. భార్య వెరకొరితో తిరుగుతోందని ఒకరు, ప్రియురాలు తనను దూరం పెట్టిందని మరొకరు, బంగారం దోచుకునేందుకు.. ఇలా రకరకాల రూపంలో హత్యలు జరుగుతూనే ఉన్నాయి. మరోవైపు మద్యం, గంజాయి మత్తుతో ఇటువంటి ఘటనలు పెరుగుతుండడం కూడా భయం గొలుపుతోంది. సెల్‌ఫోన్లను సద్వినియోగం కంటే దుర్వినియోగానికే ఎక్కువగా వినియోగిస్తుండడం ఆందోళన కలిగిస్తోంది. ఫోన్లలో పరిచయమైన అపరిచిత వ్యక్తులతో మాటలు కలపడం, సోషల్ మీడియా ద్వారా పరిచయాలు అనేక అనర్థాలకు కారణమవుతున్నాయి. వివాహేతర సంబంధాలు సజావుగా సాగుతున్న సంసారంలో చిచ్చులు పెడుతున్నాయి. హత్యలకు దారితీస్తున్నాయి. వివాహేతర సంబంధాలతో భార్య, ప్రియుడితో కలిసి ఎక్కువగా హతమార్చిన ఘటనలు బయటపడుతున్నాయి. వారి కుటుంబాలు వీధిన పడుతున్నాయి. అలాగే మద్యం మత్తులో జరిగిన ఘాతుకాలే అధికంగా ఉన్నాయి. జిల్లాలో విచ్చలవిడిగా పట్టుబడుతున్న గంజాయి చూస్తుంటే ఏ స్థాయిలో వినియోగిస్తున్నారో అర్థం అవుతోంది. అందుకే మద్యం మత్తులో ఉండేవారితో వీలైనంతగా వాదనలు పెట్టుకోకూడదని నిపుణులు సూచిస్తున్నారు. భార్యాభర్తలు కూడా అన్యోన్యంగా జీవిస్తే ఎటువంటి కలహాలు ఉండవని స్పష్టం చేస్తున్నారు. కుటుంబ సభ్యుల్లో కూడా సర్దుకుపోయే తత్వం ఉంటే ఘర్షణలు, హత్యలకు దారితీయవని చెబుతున్నారు. మనిషిలో మానవతా విలువలు తగ్గిపోవడం, ఇష్టం లేని వివాహాలు చేయడం అనర్థాలకు ప్రధాన కారణం. అందుకే పిల్లలకు కూడా ప్రాథమిక స్థాయి నుంచి మానవతా విలువలు, నైతిక విలువల గురించి చెప్పాలని మానసిక వైద్య నిపుణులు చెబుతున్నారు.

● ఈ నెల 3న ఎచ్చెర్ల నియోజకవర్గంలో ఇద్దరు మహిళలు హత్యకు గురయ్యారు. లావేరు మండలం మురపాకలో పశువులను మేతకు తీసుకెళ్లిన వడ్డి పార్వతీ అనే మహిళ వద్ద గుర్తుతెలియని వ్యక్తులు బంగారు ఆభరణాలు దొంగిలించారు. ఆమెను చంపేసి.. మృతదేహాన్ని బావిలో పడేశారు. ఎచ్చెర్ల మండలం కేశవరావుపేట జంక్షన్ వద్ద తులసీరత్నం అనే మహిళ అనుమానాస్పద స్థితిలో మృతిచెందింది. ఆమె హత్యకు గురైనట్టు పోలీసుల విచారణలో తేలింది.



వడ్డి పార్వతి, తులసీ రత్నం (ఫైల్)

ఘటనలెన్నో

- అక్టోబరు 30న ఆమదాలవలస చంద్రయ్యపేటలో ఓ వివాహిత దారుణ హత్యకు గురైంది. ఆమెతో సన్నిహితంగా ఉండే నవీన్ అనే యువకుడు ఈ దరుణానికి ఒడిగట్టాడు. ఆమె ఇంట్లో ఉన్న బంగారం, వెండి ఆభరణాలు దోచుకుపోయాడు.
- ఆగస్టు 27న నరసన్నపేటకు చెందిన బంగారం వ్యాపారి పార్వతీశం గుప్త దారుణ హత్యకు గురయ్యారు. బంగారం కోసం కారు డ్రైవర్‌తోపాటు మరో వ్యక్తి ఆయన్ను కిడ్నాప్ చేసి ఆపై చంపేశారు. మృతదేహాన్ని శ్రీకాకుళం శివారులోని రామిగెడ్డలో పడేశారు.
- మే 17న సోంపేట మండలం పాలవలసకు చెందిన గోకర్ల ఈశ్వరరావు అనే యువకుడు దారుణ హత్యకు గురయ్యాడు. వివాహేతర సంబంధం నేపథ్యంలో సమీప బంధువే ఈ ఘాతుకానికి ఒడిగట్టాడు.
- మే 8న కోటబొమ్మాళిలో పట్టపగలే లక్ష్మీ అనే మహిళను ఆమె భర్త తిరుపతిరావు నరికి చంపేశాడు. దంపతులిద్దరి మధ్య విభేదాలు రావడంతో వేర్వేరుగా ఉంటున్నారు. ఈ క్రమంలో భార్యపై అనుమానం పెంచుకుని గొడవ పడుతూ పదునైన ఆయుధంతో గొంతుకోసి (మిగతా 7వ పేజీలో..)

ప్రజల సహకారంతో నేర నియంత్రణ

జిల్లాలో నేర నియంత్రణపై పోలీస్ శాఖ దృష్టిపెట్టింది. కుటుంబ పరిస్థితులు, ఇతరత్రా కారణాల వల్ల కొందరు హత్యకు గురవుతున్నారు. మరి కొందరు నిందితులు అవుతున్నారు. అందుకే పిల్లల కదలికలపై తల్లిదండ్రులు గుర్తించాలి. ఇంట్లో సైతం సమస్యలు చెప్పుకునే మంచి వాతావరణం ఉండాలి. ప్రజల సహకారంతోనే నేరాల నియంత్రణ సాధ్యం.

- వివేకానంద, డీఎస్పీ, శ్రీకాకుళం

ఇంకా వారమే!

- ఇళ్ల నిర్మాణ దరఖాస్తులకు ముగియనున్న గడువు
- జిల్లాలో చురుగ్గా పీఎం ఆవాస్ యోజన సర్వే
- ఇప్పటివరకూ 56వేల మంది పేర్లు నమోదు



సర్వే చేసి వివరాలు నమోదు చేస్తున్న సచివాలయ ఉద్యోగి

ఇచ్ఛాపురం, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకానికి సంబంధించి దరఖాస్తు ప్రక్రియ చురుగ్గా సాగుతోంది. వాస్తవానికి గత నెల 30తోనే దరఖాస్తుల స్వీకరణ ప్రకియ ముగిసినా.. ప్రభుత్వం ఈ నెల 14 వరకూ గడువు పెంచింది. ఈ పథకం కింద పక్కా ఇంటిని నిర్మించుకునేందుకు కేంద్ర ప్రభుత్వం రూ.1.59 లక్షలు మంజూరు చేస్తుంది. ఇంటి నిర్మాణానికి రూ.1.20 లక్షలు, స్వచ్ఛభారత్ కింద మరుగుదొడ్డి నిర్మాణానికి రూ.12 వేలు, ఉపాధి హామీ పథకం కింద మరో రూ.27వేలు అందిస్తారు. దీనికి రాష్ట్ర ప్రభుత్వం మరికొంత మొత్తాన్ని అందజేయనుంది. కొద్దిరోజులుగా సచివాలయ ఉద్యోగులు క్షేత్రస్థాయి పరిశీలన చేసి దరఖాస్తులు నమోదు చేస్తున్నారు. ఇప్పటివరకూ ఇళ్ల కోసం 56వేల మంది దరఖాస్తు చేసుకున్నట్టు అధికారులు చెబుతున్నారు. అత్యధికంగా ఎచ్చెర్ల నియోజకవర్గంలో 9,671 దరఖాస్తులు వచ్చాయి. అత్యల్పంగా శ్రీకాకుళం నియోజకవర్గంలో 4,708 దరఖాస్తులు అందాయి. ఆమదాలవలసలో 7,979, పాతపట్నంలో 7,437, టెక్కలిలో 6,061, ఇచ్ఛాపురంలో 6,133, నరసన్నపేటలో 8,331, పలాస నియోజకవర్గంలో 5,695 దరఖాస్తులు వచ్చాయి. ఇంకా వారం రోజులపాటు (మిగతా 8వ పేజీలో..)



సున్నాడ సీసీ రోడ్డు మధ్య ఏర్పడిన బీటలు

భూకంపం వచ్చినట్లు!

- నాలుగేళ్లకే పగుళ్లు ఏర్పడిన సీసీ రోడ్డు
- రూ.1.70 కోట్లు వృథా

పలాస, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): పలాస మండలం సున్నాడ సీసీ రహదారిపై.. ఏదో భూకంపం వచ్చినట్లు పెద్ద పగుళ్లు ఏర్పడ్డాయి. నిర్మించిన నాలుగేళ్లకే రోడ్డు దెబ్బతినడంతో నాణ్యతా ప్రమాణాలు ఏ స్థాయిలో ఉన్నాయో అర్థమవుతోంది. ఇంజనీరింగ్ అధికారుల పర్యవేక్షణ లోపం, కాంట్రాక్టర్ నిర్లక్ష్యానికి ఈ రోడ్డు దుస్థితి అద్దం పడుతోంది. వైసీపీ ప్రభుత్వ హయాంలో 2020 జూలైలో కాశీబుగ్గ తర్లా రోడ్డు నుంచి సున్నాడ గ్రామం వరకు (చెరువు గట్టు మీదుగా) సీసీ రోడ్డు నిర్మాణానికి అప్పటి మంత్రి సీదిరి అప్పలరాజు శంకుస్థాపన చేశారు. ఆంధ్రప్రదేశ్ గ్రామీణ రహదారుల పథకం (ఏఐబీ) నిధులు రూ.1.70కోట్లు కేటాయించారు. నిధులు సకాలంలో రాకపోవడంతో ఇంకా వంద మీటర్ల పనులు పెండింగ్‌లో ఉన్నాయి. కాగా పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడంతో నిర్మించిన ఏడాది నుంచే రోడ్డుపై భారీ పగుళ్లు ఏర్పడ్డాయి. పగుళ్లను పలుమార్లు కప్పినా మళ్లీ యథాతథంగా ఏర్పడుతున్నాయి. దీనిపై పంచాయతీరాజ్ డీఈఈ జి.రవిబాబును వివరణ కోరగా.. 'రోడ్డు పగుళ్ల విషయం మా దృష్టికి వచ్చింది. వాటిని పూడ్చాలని సంబంధిత కాంట్రాక్టర్లకు ఆదేశించాం. వారికి బిల్లులు కూడా కొద్దిగా మాత్రమే ఇచ్చాం. పనులు పూర్తి చేసిన తరువాతే పూర్తి బిల్లులు చెల్లిస్తామ'ని స్పష్టం చేశారు.



శ్రీకూర్మంలో జస్టిస్ రవినాథ్ తిలహరిని ఆశీర్వదిస్తున్న వేద పండితులు

శ్రీకూర్మనాథుని సేవలో హైకోర్టు న్యాయమూర్తి

గార, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): శ్రీకూర్మంలోని కూర్మనాథ స్వామిని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి, జస్టిస్ రవినాథ్ తిలహరి కుటుంబసభ్యులతో కలిసి ఆదివారం దర్శించుకున్నారు. జిల్లా న్యాయాధికారి జునైద్ అహ్మద్‌మౌలానా, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.హరిబాబుతో కలిసి ఆలయాన్ని సందర్శించారు. వారికి ఆలయ అధికారులు, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలుకగా, వేద పండితులు ఆశీర్వచనం చేశారు. స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజల అనంతరం లక్ష్మీతాయారు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ చరిత్ర, ప్రాధాన్యతను అర్చకులు వివరించారు. స్వామి ప్రసాదాన్ని, చిత్రపటాన్ని ఈవో టి.వాసుదేవరావు, అర్చకులు సీతారామ నరసింహాచార్యులు అందించారు. అలాగే అరసవల్లిలో ఆదిత్యుడ్ని కూడా జస్టిస్ రవినాథ్ తిలహరి దర్శించుకున్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ న్యాయాధికారి కె.అనురాగ్, ప్రొటోకాల్ ఇన్‌చార్జి బి.నాగభూషణం పాల్గొన్నారు.

'ఎర్రన్న విద్యా సంకల్పం'లో నవోదయ మోడల్ పరీక్ష
● జిల్లా వ్యాప్తంగా 917 మంది హాజరు 7లో

భవనాలు శిథిలం.. ప్రాణాలకు ప్రమాదం
● పాడైన ప్రభుత్వ కార్యాలయాలు
● బిక్కుబిక్కుమంటూ ఉద్యోగుల విధులు 8లో

వసతిగృహాల్లో మౌలిక వసతులు కల్పిస్తాం
● బీసీ సంక్షేమశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సత్యనారాయణ

లారీ కిందకు దూసుకుపోయిన ద్విచక్ర వాహనం 8లో

దేశభద్రతలో సైనిక సేవలు కీలకం

ఆమదాలవలస, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): దేశభద్రతలో సైనికుల సేవలు అత్యంత కీలకమని 38 ఆసాల్ట్ ఇంజనీరింగ్ రెజిమెంట్ సైనికాధికారి, సుబేదార్ సంపతిరావు కృష్ణారావు అన్నారు. పట్ట ణంలోని ఓ ప్రైవేటు ఆడిటోరియంలో ఆదివారం రెజిమెంట్ 54వ అవతరణ దినోత్స వం నిర్వహించారు. ప్రపంచంలో శాంతిభద్రతలు సవాల్‌గా మారుతున్న సమయంలో భారతదేశం అజేయమైన సైనికశక్తిని కలిగి ఉండడం గర్వకారణమన్నారు. ఈ సందర్భంగా నాట్యశ్రీ కళానికేతన్ దర్శ కురాలు కూన శ్రీలత బృందం నిర్వహించిన నృత్యపదర్శనలు ఆకట్టుకు న్నాయి. పాఠశాలలు, దేవాలయాలయాల్లో వేలాది మొక్కలు నాటి సం రక్షిస్తున్న హిందీ ఉపాధ్యాయుడు మందపల్లి రామకృష్ణారావును వనమిత్ర పుర స్కారంలో సత్కరించారు. కార్యక్రమంలో మాజీ సైనికాధికారులు పైడి గోవిందరావు, నారా జనార్దనరావు, కెప్టెన్ రాజా రావు, పి.నాగేశ్వరరావు, విశాఖపట్నం రీజియన్ మాజీ సైనికాధి కారుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

కరెన్సీ నోట్లపై అంబేద్కర్ ఫొటో ముద్రించాలి

శ్రీకాకుళం అర్బన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కరెన్సీ నోట్లపై అంబేద్కర్ ఫొటో ముద్రించాలని కోరుతూ ఈనెల 15, 16 తేదీల్లో చలో ఢిల్లీ కార్యక్రమం నిర్వహిస్తున్నామని అంబేద్కర్ ఫొటో సాధన సమితి జాతీయ అధ్యక్షుడు డాక్టర్ జెరిపోతుల పరశురామ్ అన్నారు. ఆదివారం ఇలిసిపురంలోని అంబేద్కర్ విజ్ఞాన మందిరంలో సమితి కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. చలో ఢిల్లీ కరపత్రాలను ఆవిష్కరించారు. చలో ఢిల్లీని విజయవంతంచేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కంఠ వేణు, జిల్లా నాయకులు పురుషోత్తం, రాంబాబు, కరణం మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు కొత్తపేట రోడ్డు పనులు ప్రారంభం



కొత్తపేట వద్ద జరుగుతున్న రోడ్డు పనులు

ఎచ్చెర్ల, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): తోటపాలెం జంక్షన్ నుంచి సైలాడ పేట, కొత్తపేట మీదుగా అంబేద్కర్ నగర్ వరకు రోడ్డు నిర్మాణ పనులు ఎట్టకేలకు ప్రారంభమయ్యాయి. సుమారు 5.2 కిలో మీటర్ల పొడవు ఉన్న ఈ రోడ్డు పనులకు ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు చొరవ తీసుకుని నాబార్డు నుంచి రూ.3 కోట్లు మంజూరుచేయించారు. ఈ రోడ్డు పనులు ప్రారంభం కావడంతో స్థానికుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. 2014-19 మధ్య అప్పటి టీడీపీ ప్రభుత్వంలో ఈ రోడ్డు పనులను ప్రారంభించినప్పటికీ 25 శాతం కన్నా తక్కువ జరిగిన పనులను ఆ తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం రద్దు చేసింది. దీంతో ఈ రోడ్డు పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో నాబార్డు నుంచి నిధులు మంజూరు కావడంతో పనుల్లో పురోగతి కనిపించింది. ఈ రోడ్డు పనులు పూర్తయితే సైలాడపేట, కొత్తపేట, కోదువానిపేట, గాడుపేట, అంబేద్కర్ నగర్ తదితర గ్రామాలకు రవాణా సౌకర్యం మరింత మెరుగుపడుతుంది. దీనిపై ఏఈ పోలినాయుడు మాట్లాడుతూ.. ఈ రోడ్డు పనులు మార్చి నాటికి పూర్తిచేస్తామన్నారు.

ఆలోచింపజేసిన 'సహాన' నాటిక



'సహాన' నాటికలో ఓ సన్నివేశం

పాత శ్రీకాకుళం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం రంగస్థల కళాకారుల సమాఖ్య నెలవారీ సాంస్కృతిక విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉభయ తెలుగు రాష్ట్రాల ఆహ్వాన నాటిక పోటీలు బాపూజీ కళామందిర్‌లో ఆదివారం నిర్వహించారు. చివరి రోజు అభినయ్ ఆర్ట్స్ గుంటూరు వారిచే 'సహాన' నాటిక ఆద్యంతం ఆలోచింపజేసింది. సమాజంలో ఆడపిల్లకు అన్యాయం జరిగితే ఆ అన్యాయాన్ని సమాజమే సరిచేస్తుందనే అంతర్లీన సందేశంతో ఈ నాటిక సాగుతుంది. ఈ నాటికలో సహాన అనే అమ్మాయికి జరిగిన అన్యాయానికి లంచాలు తీసుకునే అధికారులు, రాజకీయవేత్తలు సరైన న్యాయం చేయకపోయినా సమాజం తిరగబడి దోషిని శిక్షించడంతో నాటిక ముగుస్తుంది. కళాకారులంతా తమ పాత్రలకు జీవంపోశారు. అలాగే 'మంచి మనసు' నాటికను ప్రదర్శించారు. కార్యక్రమంలో రంగస్థల నటుడు, పద్మశ్రీ యడ్ల గోపాల రావు, సంస్థ నిర్వాహకులు పన్నాల నరసింహమూర్తి, రామచంద్రదేవ్, పి.జగన్‌మోహన్‌రావు, చెన్నకేశవ రావు, పైడి సత్యవతి, ఐ.రమణారావు, జ్యోతి, బీఎస్ భూషన్ తదితరులు పాల్గొన్నారు.

'ఎర్రన్న విద్యా సంకల్పం'లో నవోదయ మోడల్ పరీక్ష

- జిల్లా వ్యాప్తంగా 917 మంది హాజరు
- పరిశీలించిన ఎమ్మెల్యే గొండు శంకర్

పాత శ్రీకాకుళం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఎర్రన్న విద్యా సంకల్పంలో భాగంగా ఆదివారం నవోదయ మోడల్ పరీక్ష జిల్లా వ్యాప్తంగా నిర్వహించారు. కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు చొరవతో ఎర్రన్న విద్యా సంకల్పంలో భాగంగా వివిధ పోటీ పరీక్షలను సైతం నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. నవోదయ మోడల్ పరీక్షను ఎమ్మెల్యే గొండు శంకర్ పరిశీలించారు. ఈ పరీక్షలకు 1129 మంది రిజిస్ట్రేషన్ చేసుకోగా వారిలో 917 మంది పరీక్షలకు హాజరయ్యారని నిర్వా హకులు తెలిపారు. ప్రశాంతంగా పరీక్ష జరిగిందదని, ఫలితాలు త్వరలోనే వెబ్ సైట్‌లో, విద్యార్థుల రిజిస్టర్ మొబైల్ నెంబరుకు మెసేజ్ పంపడం జరుగుతుందని వారు తెలిపారు.

చంపేస్తున్నారు!

(ఐదో పేజీ తరువాయి)

పరారయ్యాడు. ఆ దంపతుల పిల్లలు అనాథలుగా మిగిలారు.

- ఏప్రిల్ 19న రణస్థలం మండలం పైడిభీమవరం జంక్షన్ సమీపంలోని చెరువు వద్ద భవాని అనే మహిళ దారుణ హత్యకు గురైంది. స్థానికంగా ఓ హోటల్‌లో పనిచేసే ఆమెను చెరువు వద్దకు పిలిచి గొంతు కోశాడు నిందితుడు. వివాహేతర సంబంధం మాటున ఈ హత్య జరిగినట్టు పోలీసు విచారణలో తేలింది.
- ఈ ఏడాది మార్చిలో నరసన్నపేటలో ఓ వృద్ధురాలిని బాలుడు హత్య చేశాడు. తులంన్నర బంగారం కోసం అతి కిరాతకంగా హత్య చేశాడు.
- జనవరి 20న శ్రీకాకుళం న్యూ కాలనీలో 50 ఏళ్ల మహిళ దారుణ హత్యకు గురయ్యారు. పొందూరు మండలానికి చెందిన ఆమె న్యూ కాలనీలోని ఓ ప్లాట్‌లో విగత జీవిగా పడి ఉండడాన్ని గుర్తించారు. శరత్ అనే వ్యక్తి ఆమెను హత్యచేసినట్టు పోలీసులు గుర్తించారు. ఆర్థిక, వివాహేతర సంబంధమే ఈ హత్యకు కారణమని విచారణలో తేలింది.

ఆర్ట్స్ కళాశాలలో స్వచ్ఛభారత్



కళాశాల పరిసరాలను శుభ్రం చేస్తున్న ఎన్‌సీసీ క్యాడెట్లు

గుజరాతీపేట, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ పురుషుల (ఆర్ట్స్) కళాశాలలో స్వచ్ఛ భారత్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆర్మీ ఫ్లాగ్ డే సందర్భంగా ఆదివారం కళాశాల ఆవరణలో ఎన్‌సీసీ క్యాడెట్లు శుభ్రం చేశారు. క్యాంపస్ క్లీనింగ్ ద్వారా ఆరోగ్యవంత మైన సమాజం వైపు అడుగులు వేస్తుందని కళాశాల ప్రిన్సిపాల్ యాళ్ల పోలినాయుడు అన్నారు. కార్యక్రమంలో వాణిజ్య శాస్త్ర అధ్యాపకురాలు ఎన్.పావని, ఎన్‌సీసీ క్యాడెట్లు పాల్గొన్నారు.

రూ.20.05 లక్షలతో సాంస్కృతిక కళావేదిక

- ఎమ్మెల్యే గొండు శంకర్



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గొండు శంకర్

పాత శ్రీకాకుళం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): అరసవల్లి కోనేరు సమీపంలో సాంస్కృతిక కళా వేదిక నిర్మాణం చేపడుతున్నామని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. ఆదివారం వేదిక నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు ఎంపీ నిధులు రూ.20.05 లక్షలతో దీనిని నిర్మిస్తున్నట్లు తెలిపారు. వేదికతో పాటు ప్రవేశ ద్వారం, విడివిడి గదులు, బాత్రూమ్ తదితర నిర్మాణాలు చేపట్టనున్నామన్నారు. దీనిని వివాహాలు తదితర వేడుకలు నిర్వహించేందుకు అనువుగా తీర్చిదిద్దనున్నట్లు పేర్కొన్నారు. రానున్న అసిరితల్లి పండుగ, రథసప్తమి ఉత్సవాలను దృష్టిలో పెట్టుకుని రోడ్లు, కాలువలు, ప్రధాన మార్గాల అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. అరసవల్లి-కళ్లేపల్లి రోడ్డును వెడల్పుతో పాటు, వెలమ వీధి, తోట రోడ్డు తదితర ప్రతిపాదిత వీధుల్లో అసరమైన మేర రోడ్లు, కాలువల నిర్మాణం చేపట్టాలని అధికారు లను ఆదేశిం చారు. ఇంద్రపుష్కరిణి వెనుక రాణిగెడ్డ-రామిగెడ్డ ప్రాంతాలను ఆధునీకరించి రోడ్డు వెడల్పు చేయాలని ఆదేశించినట్లు తెలిపారు. ఎమ్మెల్యే శంకర్ విజయం సందర్భంగా అరసవల్లి టీడీపీ నాయకులు, కార్యకర్తలు 100 కొబ్బరికాయలు కొట్టి సూర్య నారాయణ స్వామికి మొక్కు చెల్లించారు.

రథసప్తమి ఏర్పాట్లపై సమీక్ష

ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అరవల్లి సూర్యనారాయణ స్వామి ఆల యంలో రథసప్తమి ఉత్సవాల నేపథ్యంలో ఏర్పాట్లపై ఆదివారం ఎమ్మెల్యే గొండు శంకర్ సమీక్షించారు. వచ్చే ఏడాది జనవరి 19 నుంచి 25వ తేదీ వరకు ఏడు రోజులుపాటు నిర్వహించేందుకు గాను తీసుకోవాల్సిన చర్యలపై ఈవో కేఎన్ వీడీవీ ప్రసాద్, ప్రధాన అర్చకుడు ఇప్పిలి శంకరశర్మతో చర్చించారు. ప్రతీరోజు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని, ఏడు రోజుల పాటు ప్రత్యేక అలంకరణలు, పూజలు నిర్వహించే దిశలో ఆగమ శాస్త్ర ప్రకారం సమగ్ర ప్రణాళిక రూపొందించాలని సూచించారు.

ఆదిత్యుని సన్నిధిలో బీసీ వెల్ఫేర్ ప్రిన్సిపల్ సెక్రటరీ

పాత శ్రీకాకుళం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్య ప్రదాత అరసవల్లి సూర్యనారాయణ స్వామిని ఆదివారం బీసీ వెల్ఫేర్ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్.సత్యనారాయణ దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆయనకు ఆలయ అర్చకులు ఇప్పిలి శంకరశర్మ, ఈవో కేఎన్ వీడీవీ ప్రసాద్ స్వాగతం పలుకగా అర్చకులు వేద మంత్రాలతో ఆశీర్వదించారు. స్వామివారి ప్రసాదాలు, జ్ఞాపికలను అందజేశారు. ● సూర్యనారా యణ స్వామికి ఆదివారం టికెట్లు, పూజలు, విరాళాలు, ప్రసాదాల రూపంలో రూ. 8,77,505 ఆదాయం వచ్చినట్లు ఈవో ప్రసాద్ తెలిపారు. ● శ్రీకాకుళానికి చెందిన ఆకుల మహేశ్వరరావు అన్నదానానికి ఉపయోగించే రూ.లక్ష విలువచేసే 10 స్టీల్ బెంచీలు, మద్రపు వెంకట నాయుడు, సత్యాదేవి రూ.20 వేలు విలువ చేసే రెండు స్టీలు బెంచీలు అందించారు. వీటిని ద్వారపు అజిత్ కుమార్, అనురాధ ఆధ్వర్యంలో ఈవోకి అందజేశారు.



బీసీ వెల్ఫేర్ ప్రిన్సిపల్ సెక్రటరీ సత్యనారాయణకు చిత్రపటం అందిస్తున్న ఈవో ప్రసాద్

న్యూస్ బాక్స్

ఎక్సైజ్ అధికారుల తనిఖీ

సోంపేట, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): దాబాల్లో మద్యం దుకాణాలు నిర్వహిస్తే బైండోవర్ కేసు లు నమోదు చేస్తామని ఎక్సైజ్ సీఐ జీవీ రమణ హెచ్చరించారు. ఆదివారం దాబాలను తనిఖీ చేశా రు. ప్రతీ దాబాలో మద్యం అనుమతి లేదంటూ బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. ఈ దాడుల్లో బెల్టుషాపు నిర్వహిస్తున్న పుణ్యవతిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ సిబ్బంది మార్కారావు ఉన్నారు.

సర్వమత సారం ఒక్కటే

ఆమదాలవలస, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): సర్వమతం సారం ఒక్కటేనని సత్యసాయి సేవా సంస్థల రాష్ట్ర అధ్యక్షుడు రఘుపాత్రుని లక్ష్మణరావు అన్నారు. వేణగమ్మపేట సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో నెల్లిపర్తి గ్రామాన్ని సత్యసాయి భజన మండలిగా గుర్తింపు ఇచ్చినట్లు ఆదివారం ప్రకటించారు. సమితి జిల్లా అధ్యక్షుడు సూర రామచంద్ర రావు మాట్లాడుతూ.. సత్యసాయి నేషనల్ లీడర్‌షిప్ ప్రోగ్రాంలో భాగంగా ఈ గ్రామంలో గత రెండేళ్లుగా బాల వికాస్ కేంద్రం భజన మండలి స్థాయికి ఎదగడం శుభపరిణామమన్నారు. ఈ కేంద్రాలకు సమన్వయకర్తలుగా వ్యవహరిస్తున్న ఎం.జనార్దనసాయి, జోనల్ కన్వీనర్ రవీంద్రబాబును అభినందించారు. అనంతరం వృద్ధులకు దుప్పట్లు అందించారు.

కిడ్నీ బాధితురాలికి సాయం

ఇచ్ఛాపురం, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): బూర్జపాడు గ్రామానికి చెందిన సూరు సన్యాసి కుమార్తె జోగమ్మ కొంత కాలంగా కిడ్నీవ్యాధితో బాధపడుతూ చికిత్స పొందుతోంది. ఈ సందర్భంగా వైద్య ఖర్చుల నిమిత్తం శ్రీరాధాకృష్ణ యువజన సంఘం సభ్యులు ఆదివారం రూ.43 వేలు నగదును అందిం చారు.

నేటినుంచి గ్రిగ్స్ పోటీలు

ఇచ్ఛాపురం, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): మండల స్థాయి గ్రిగ్స్ పోటీలు సురంగిరాజా మైదానంలో సోమవారం నుంచి రెండు రోజులు పాటు నిర్వహిస్తున్నట్లు పీఈటీ జోన్-1 అధ్యక్షుడు కె.పద్మనాభం రెడ్డి తెలిపారు. ఆసక్తి ఉన్న ప్రభుత్వ, ప్రైవే ట్ పాఠశాలల విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనాలన్నారు. బాల బాలికలకు వేర్వేరుగా పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

నవోదయ మోడల్ పరీక్ష విజేతలకు బహుమతులు

బూర్జ, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి నవోదయ మోడల్ పరీక్ష స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం నిర్వహించారు. ఈ పరీక్షల్లో సుమారు 750 మంది విద్యార్థులు పాల్గొన్నారు. అత్యధిక మార్కులు సాధించిన 40 మంది విద్యార్థులకు బహుమతులు అందించారు. పూర్వపు డిప్యూటీ డీఈవో ఐ.వెంకటరావు, ఎంఈవోలు ఎస్. శ్యామసుందరరావు, బి.ధనుంజయరావు, హెచ్ఎం లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

దూసి రైల్వేస్టేషన్ అభివృద్ధికి చర్యలు

ఆమదాలవలస, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): దూసి రైల్వేస్టేషన్ అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని రైల్వే కన్సల్టేషన్ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ మేరకు ఆదివారం పనులపై రైల్వే అధికారుల సమక్షంలో కన్సల్టేటివ్ కమిటీ సమావేశం నిర్వహించారు. దూసి రైల్వేస్టేషన్ అభివృద్ధి, ప్రయాణికుల సమస్యలు, కొత్త సదుపాయాలపై విస్తృతంగా చర్చించారు. బొడ్డేపల్లి రైల్వేగేటు వద్ద పై ఓవర్ నిర్మాణం, బరంపూర్, పూరి, తిరుపతి రైళ్లకు దూసి రైల్వేస్టేషన్‌లో హాల్ట్ కల్పించడంపై చర్చించారు. రైల్వేస్టేషన్ కన్సలేటివ్ కమిటీ సభ్యులు చింతాడ అప్పారావు, చిగిలిపల్లి రాజేష్, గురుబిల్లి రాజశేఖర్, రైల్వే అధికారులు పాల్గొన్నారు.

ఆదిత్యా.. సమస్యలు తీరేనా?

(ఐదో పేజీ తరువాయి)

గంటల తరబడి వాహనాలు రోడ్డు మీదే ఉండిపోతున్నాయి. ఆలయ సమీపంలో ఇదే పరిస్థితి నెలకొంటోంది. ట్రాఫిక్ నియంత్రణకు పోలీసులు చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు. సమస్యల పరిష్కారానికి అధికారులు చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ఘనంగా అమ్మవారికి పూజలు

ఇచ్ఛాపురం, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి) లొద్ద పుట్టి గ్రామదేవత ధనరాజ తులసమ్మకు ఆదివారం భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. ఉదయం 6 గంటల నుంచి ఆలయం వద్ద భక్తులు బారులుతీరారు. ఆంధ్రా, ఒడిశా గ్రామా లకు చెందిన భక్తులు అమ్మవారి ఘటాలతో పానకాల బిందెలతో వచ్చి అమ్మవారికి మొక్కులు చెల్లించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు.

వరిశాంను పంచాయతీగా ఏర్పాటు చేయాలి

- ఎమ్మెల్యే ఎన్ఈఆర్‌ను కోరిన ప్రజలు



ఎమ్మెల్యే ఈశ్వరరావుకి సమస్యలు విన్నవిస్తున్న ప్రజలు

రణస్థలం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): పైడిభీమవరం నుంచి వరిశాంను విభజించి పంచాయతీగా ఏర్పాటు చేయాలని పలు గ్రామాల ప్రజలు కోరారు. ఈ మేరకు ఆదివారం ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావును కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పైడిభీమవరం పంచాయతీలో సుమారు 6 వేల ఓట్లు ఉన్నాయని, తాము పైడిభీమ వరం పంచాయతీలో ఉన్నప్పటికీ భౌగోళికంగా దూరం, పంచాయతీ కార్యాలయానికి చేరుకునేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, గ్రామాల అభివృద్ధి సకాలంలో జరగకపోవడంతో ఇబ్బందులు పడుతు న్నామన్నారు. అందువల్ల వరిశాం పంచాయతీగా ఏర్పాటుకు కృషి చేయాలని వరిసాం, చిట్టివలస, చిల్లపేట, గొల్లపేట, సరగడ పేట తదితర గ్రామాల ప్రజలు కోరారు.

అందరి సహకారంతో సమగ్రాభివృద్ధి

- ఎమ్మెల్యే రవికుమార్



రిటైర్డ్ ఉద్యోగులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూన రవికుమార్

ఆమదాలవలస, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని నాలుగు మండలాలతో పాటు ఆమదాలవలస మునిసిపాలిటీ సమగ్రాభివృద్ధికి అందరి సహకారం తీసుకుంటామని ఎమ్మెల్యే, రాష్ట్ర పీయూసీ చైర్మన్ కూన రవికుమార్ అన్నారు. ఆదివారం పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో రిటైర్డ్ మునిసిపల్ కమిషనర్ పూజారి బాలాజీ ప్రసాద్, తహసీల్దార్ పేడాడ జనార్దనరావు తదితరులు ఆయనను కలిశారు. అనంతరం ఆయన వారితో కలిసి విలేకరులతో మాట్లాడుతూ.. రాజకీయాలకు అతీతంగా అందరి సహకారంతో సీఎం చంద్రబాబునాయుడు చొరవతో సమగ్ర అభివృద్ధి సాధించడమే లక్ష్యంగా కృషి చేస్తున్నానని తెలిపారు. ముఖ్యంగా కొంతమంది వ్యక్తులు నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక నిరాధార ఆరోపణలు చేస్తూ అభివృద్ధిని అడ్డుకోవడం బాధాకరమన్నారు. రిటైర్డ్ ఉద్యోగులు నియోజకవర్గంలోని సమస్యలను గుర్తించి స్థానికులకు అవగాహన కలిగించడంతో పాటు వాటిని తన దృష్టికి తీసుకువస్తే పరిష్కా రానికి కృషి చేస్తానన్నారు. నిరు ద్యోగ యువతీ, యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు పరిశ్రమల స్థాపనతో పాటు వివిధ కంపెనీల ద్వారా జాబ్‌మేళాలు ఏర్పాటు చేసేందుకు ప్రణాళిక రూపొందించడం జరిగిందన్నారు.

బాధితులకు పరామర్శ

బూర్జ, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): పెద్దపేట పంచాయతీ కొండపేటలో రైతులు మజ్జి సూర్యనారాయణ, పాలక వరాలమ్మకు చెందిన వరి కుప్పలు గుర్తుతెలియని వ్యక్తులు నిప్పుపెట్టిన విషయం తెలుసుకుని ఎమ్మెల్యే కూన రవికుమార్ ఆదివారం పరామర్శించారు. నష్టాన్ని అంచనా వేసి అవసరమైన సహాయం అందించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ డైరెక్టర్ ఆనెపు రామకృష్ణ నాయుడు, నీటి సంఘాల అధ్యక్షుడు కడడగల కృష్ణ, స్థానిక నాయకుడు వావిలపల్లి నారాయణరావు పాల్గొన్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

నాగవంశం సామాజికవర్గ అభివృద్ధికి కృషి

- రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్ రమణారావు



చైర్మన్ రమణారావును సన్మానిస్తున్న రంగా దంపతులు

పొందూరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా వెనుకబడి ఉన్న నాగవంశం సామాజికవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని ఆ సంఘం కార్పొరేషన్ చైర్మన్ ఎరుబోతు రమణారావు అన్నారు. ఆదివారం మండల కేంద్రం లో టీడీపీ పట్టణ అధ్యక్షుడు అనకాపల్లి చినరంగా ఇంటిలో విలేకరులతో మాట్లాడారు. సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం వెనుకబడిన సామాజిక వర్గాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తోందన్నారు. కార్పొరేషన్ ద్వారా సామాజికవర్గంలో వెనుక బడిన వారికి రుణాలందించడం, విద్య, వైద్య పరంగా సహకారం అందించేందుకు కృషి చేస్తానన్నారు. సామాజికవర్గాన్ని బీసీ-డి నుంచి బీసీ-ఎ రిజర్వేషన్‌కు మార్చేలా సీఎం చంద్రబాబు, ఉపముఖ్య మంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకు వెళతానన్నారు. అనంతరం ఆయనను టీడీపీ నాయకుడు రంగా, ఎంపీటీసీ ఎ.వాణి తదితరులు సత్కరించారు.

ఇసుక అక్రమ రవాణా అడ్డుకున్న రైతులు

ఇచ్ఛాపురం, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): బాహుదా నది నుంచి ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్న వాహనాలను ఆదివారం బెల్లుపడ వద్ద రైతులు అడ్డుకున్నారు. సొంత ఖర్చులతో ఎక్స్‌కవేటర్ సాయంతో నదిలోకి ట్రాక్టర్లు వెళ్లకుండా గోతులను తీశారు. కార్య క్రమంలో నీటి సంఘ అధ్యక్ష కార్యదర్శులు ధనుంజయరెడ్డి, రామారావు పాల్గొన్నారు.

ఎక్స్‌కవేటర్‌తో పనులు చేపడుతున్న దృశ్యం



ప్రాథమిక దశలోనే చికిత్స చేయించుకోవాలి



రోగులను పరీక్షిస్తున్న డా.శశిధర్

పొందూరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక దశలోనే వ్యాధిని గుర్తించి ప్రథమ చికిత్స అందించడం ద్వారా ప్రాణాపాయం నుంచి బయటపడవచ్చని జనరల్ ఫిజీషియన్ డా.అన్నెపు శశిధర్ అన్నారు. పొందూరులో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 250 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి మందులను పంపిణీ చేశారు. రూ.2,500 విలువచేసే ఎముకల సాంద్రత, రూ.700 విలువచేసే థైరాయిడ్ పరీక్షలను ఉచితంగా చేశారు. శిబిరాన్ని సర్పంచ్ ఆర్.లక్ష్మి, ఎ.విజయలక్ష్మి, మాజీ సర్పంచ్ కె.సాయికుమార్ ప్రారంభించారు.

నేడు సంతోషిమాత ఆలయ వార్షికోత్సవం

ఇచ్ఛాపురం, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): బెల్లుపడ కాలనీ సయ్యద్ ఖాన్ చెరువు పక్కన కొలువు తీరి ఉన్న సంతోషి రూపాదేవి ఆలయం 32వ వార్షికోత్సవం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేస్తున్నామన్నారు. భక్తులు పాల్గొని అమ్మ వారిని దర్శించుకోవాలని కోరారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, దేవదాయ ధర్మదాయ శాఖ
శ్రీ సూర్యనారాయణస్వామి వారి దేవస్థానం
అరసవల్లి, శ్రీకాకుళం జిల్లా-532 401
సీల్డ్ టెండర్ ప్రకటన Rc No.140/2025

శ్రీకాకుళం జిల్లా, అరసవల్లి గ్రామంలో వేంచేసియున్న శ్రీ సూర్యనారాయణస్వామి వారి దేవస్థానమునందు 25.01.2026వ తేదీన శ్రీ స్వామివారి రథసప్తమి సందర్భంగా ఈ క్రింది తెలిపిన ఐటమ్‌లకు 19-12-2025వ తేదీన ఉదయం 11 గంటలకు సీల్డ్ టెండర్ కోరడమైనది. టెండర్ షరతులు మరియు ఇతర వివరములు కొరకు కార్యాలయ పనివేళలనందు తెలుసుకొనవచ్చు.

వ.నెం.	సీల్డ్ టెండర్ ఐటము వివరము	ధరావత్తు	టెండర్ షెడ్యూల్ ఖరీదు
1	ప్రసాదములు అమ్మకము సంబంధించి మూరు ప్రదేశములలో కౌంటర్స్ మరియు అధికారులు నిర్ణయించిన ప్రదేశములో దర్శన టిక్కెట్ల కౌంటర్లు, వాటర్‌ప్రూఫ్ టెంట్లు, కుర్చీలు మరియు బల్లల ఏర్పాటు	---	200/-
2	దేవస్థానం ప్రాంగణంలో క్యూలైన్స్ ఏర్పాటు నిమిత్తం ఐరన్ మరియు చెక్కతో స్టేజ్ బల్లలు మూడు చోట్ల తయారుచేసి ఇచ్చుటకు	---	200/-
3	24-01-2026వ తేదీన 30మంది, 25-01-2026న 60మంది మరియు 26-01-2026న 30మంది స్వీపర్లు, స్కావెంజ్‌లు డ్రెస్‌కోడ్‌తో ఏర్పాటు చేయుట	---	300/-
4	24-01-2026, 25-01-2026 మరియు 26-01-2026వ తేదీలలో ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనం, సాయంత్రం స్నాక్స్, రాత్రి భోజనం, నాలుగు దఫాల టీలు ఏర్పాటు, సుమారు 3000మందికి ఏర్పాటు చేయుట మెనూ షెడ్యూల్ ప్రకారంగా	10000/-	300/-
5	అధికారులు నిర్దేశించిన ప్రదేశములలో ఫోటోలు, వీడియోలు తీయు నిమిత్తం	---	200/-
6	వివిధ రకముల టికెట్స్ ప్రింటింగ్, ఐడికార్డ్స్, ఐడెంటి బ్యాడ్జెస్, ఆహ్వాన పత్రికలు, వాల్‌పోస్టర్స్, ఐరన్ ఫ్లెక్సీలు ముద్రించుటకు	---	200/-
7	స్వామివారి రథసప్తమి ది.18-01-2026 నుండి 23-01-2026 వరకు రథసప్తమి మహోత్సవము సందర్భంగా ఆలయము ముఖ మండపం నందు ఒక్కోరోజు ఒక్కో విధముగా దేవాలయము మూసిన అనంతరం వేరువేరు పుష్పములతో పులాంకరణ చేయుటకు గానూ	---	300/-
8	304 క్వాంటిటీ గల SC తో క్యూలైన్స్ నిమిత్తము షెడ్యూలులో తెలిపిన ప్రకారము తయారుచేసి అప్పగించుటకు	10000/-	300/-
9	భక్తులకు RO త్రాగునీరు సౌకర్యార్థము 10 ప్రదేశములలో స్టాండ్స్ ఏర్పాటు నిమిత్తము పైప్‌లైన్స్ నిమిత్తము, సీసీరోడ్ చుట్ట కటింగ్ చేయుటకు సుమారు 1200 అడుగుల	---	200/-
10	మున్సిపల్ హైస్కూల్ రోడ్‌నకు 2 ప్రదేశములలో దేవస్థానం అన్నప్రసాదం వెస్ట్ వాటర్ బయటకు పోవుటకు సీసీ రోడ్ కటింగ్‌చేసి 9 అంగుళాల పైపులు ఏర్పాటు చేయుటకు	---	200/-
11	శ్రీ స్వామివారి రథసప్తమి సందర్భంగా భక్తుల సౌకర్యార్థము తాత్కాలిక టాయిలెట్స్ 30 ఏర్పాటు చేయుటకు	---	200/-
12	NUSPAK TENT COOLER కాపర్ వైండింగ్ గలవి-8 సప్లై చేయుటకు	---	200/-
13	శ్రీ స్వామి రథసప్తమి సందర్భంగా NUSPAK TENT COOLER -20 శ్రీ స్వామివారి దేవస్థానం చూపించిన వివిధ ప్రదేశములలో ఏర్పాటు చేసి తిరిగి తీసుకుని వెళ్లుటకు అద్దె నిమిత్తము	---	200/-
14.	శ్రీ స్వామి వారి ప్రధాన దేవాలయములో ప్రస్తుతం ఉన్న ఐరన్ బారికేడ్స్‌కి (PALE CREAM) ఎనామిల్ పెయింట్ వేయుట గురించి	---	200/-
15	శ్రీ స్వామివారి రథసప్తమి సందర్భంగా ప్రోటోకాల్ నిమిత్తం ఇన్నోవా కార్లు-6 మరియు వికలాంగులు, వృద్ధుల నిమిత్తం టాటా మ్యాజిక్ -2 ఏర్పాటు చేయుట	---	200/-
16	క్యూలైన్స్ నిమిత్తం ఐరన్ బారికేడ్స్ సింహాచలం మరియు విజయనగరం ఇతర దేవస్థానముల నుండి తీసుకువచ్చి మరల తిరిగి అప్పగించుటకు ట్రాన్స్‌పోర్ట్ చార్జీల నిమిత్తం హెచ్చుతగ్గులు, లేబర్‌ఛార్జీ	---	200/-

ఫోన్ నెంబర్లు: 8978914660. వ్యవస్థాపక ధర్మకర్త | ఉప కమీషనరు మరియు కార్యనిర్వహణాధికారి

భవనాలు శిథిలం.. ప్రాణాలకు ప్రమాదం

- పాడైన ప్రభుత్వ కార్యాలయాలు
- బిక్కుబిక్కుమంటూ ఉద్యోగుల విధులు
- పట్టించుకోని యంత్రాంగం


శిథిలావస్థకు చేరిన వంశధార సెక్షన్ కార్యాలయం

కోటబొమ్మాళి, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు ప్రభుత్వ కార్యాలయాలు శిథిలావస్థకు చేరాయి. సుమారు 60 ఏళ్ల కిందట నిర్మించిన భవనాలు కావడంతో ప్రస్తుతం అవి జీర్ణోద్దరణ స్థితిలోకి వెళ్లాయి. వాటిలో కార్యకలాపాలు నిర్వహించేందుకు ఉద్యోగులు, వివిధ పనులతో అక్కడికి వచ్చే ప్రజలు ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తోందనని ఆందోళన చెందుతున్నారు. కోటబొమ్మాళిలో వంశధార సెక్షన్ కార్యాలయం నడుస్తుంది. దాదాపు 60 ఏళ్ల కిందట నిర్మించిన ఈ భవనం ప్రస్తుతం శిధిలావస్థకు చేరినా పట్టించుకున్న నాథుడు కరువయ్యారు. ఈ కార్యాలయం మొత్తం నలుమూలలా శిథిలమై ఎప్పుడు కూలుతుందోనని ఉద్యోగులు బిక్కుబిక్కు మంటూ కాలం వెల్లదీస్తున్నారు. అందులో కేవలం ఒక్క గది మాత్రం అంతంత మాత్రంగా ఎండకు, వానకు కారకుండా ఉండడంతో కార్యకలాపాలని ఈ గది నుంచే నిర్వహిస్తుండడం విశేషం. శిథిలాల్లో కొన్నాళ్లగా సంచార జాతులు నివాసముండేవారు. ప్రస్తుతం వారు కూడా ఈ భవనంపై నమ్మకం లేక వేర్వేర చోట్లకు వెళ్లి నివసిస్తున్నారు. ఇప్పటివరకు ఎన్ని ప్రభుత్వాలు మారినా, ఎన్ని నీటి సంఘాల పాలకులు వచ్చినా ఈ భవనానికి మాత్రం మోక్షం కలగడం లేదు. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి ఈ స్థానంలో నూతన భవన సముదాయాన్ని నిర్మాణం చేపట్టాలని ఉద్యోగులతోపాటు పలువురు కోరుతున్నారు. అలాగే ఆర్‌డబ్ల్యూఎస్ భవనం కూడా సుమారు 50 ఏళ్ల కిందట నిర్మించింది కావడంతో ప్రస్తుతం ఈ భవనం కూడా పూర్తిగా శిధిలావస్థలకు చేరుకోవడంతో ఇక్కడ పనిచేస్తున్న ఉద్యోగులు భయపడుతూ విధులు నిర్వహిస్తున్నారు. నూతన భవన నిర్మాణాల కోసం ఇప్పటికే ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించామని, నిధులు మంజూరు కాగానే భవన నిర్మాణాలు చేపడతామని ఆ శాఖ ఏఈలు ధర్మాన లోకేష్, టి.గౌతమి తెలిపారు.

సందడిగా ఎమ్మెల్యే బగ్గు జన్మదినోత్సవం


కేక్‌కట్ చేస్తున్న కూటమి నాయకులు

పోలాకి (నరసన్నపేట), డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): నరసన్నపేటలో ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి 67వ జన్మదిన వేడుకలు పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో తొలుత ఈ కేక్‌కట్ చేసి పంచిపెట్టారు. అనంతరం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు రొట్టెలు, పండ్లు పంపిణీ చేశారు. సిటీవెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో నరసన్నపేటలో మెగావైద్యశిబిరం నిర్వహించారు. రాగోలు జెమ్స్ వైద్యులు ఈసీజీ, టూడీ ఎకోతోపాటు పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. ప్రజా సంక్షేమ సేవా కార్యక్రమాలు చేయడంలో సిటీ వెల్ఫేర్ ముందంజలో ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమలో వివిధ కార్పొరేషన్ చైర్మన్లు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్లు, సర్పంచ్‌లు, నాలుగు మండలాల కూటమి నాయకులు పాల్గొన్నారు.


తిరుమలలో ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, కుటుంబ సభ్యులు

వెంకన్న సన్నిధిలో ఎమ్మెల్యే

కలియుగ దైవం తిరుపతి వేంకటేశ్వరస్వామిని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి దంపతులు ఆదివారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. 67వ జన్మదినం సందర్భంగా స్వామివారిని దర్శించుకున్నట్టు అనుచరులు తెలిపారు. స్వామివారి దర్శన అనంతరం వేదపండితులు ఆశీర్వాదం, తీర్థప్రసాదాలు అందించారు. ఆయన వెంట భార్య బగ్గు సుగుణ తదితరులు పాల్గొన్నారు.

తీరానికి పర్యాటకుల తాకిడి


వజ్రపుకొత్తూరు: శివసాగర్ బీచ్‌లో పర్యాటకులు

వజ్రపుకొత్తూరు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని శివసాగర్, తోటూరు, దేవునల్తాడ, కొత్తపేట, బాతుపురం, డోకులపాడు సముద్ర తీరాల్లో పర్యాటకులు తాకిడి కనిపించింది. ఆదివారం కావడంతో చుట్టుపక్కల గ్రామాలతోపాటు కాశీబుగ్గ, ఒడిశా ప్రాంతాల నుంచి కూడా పర్యాటకుల కుటుంబాలతో వచ్చి సందడి చేశారు. తోటల్లో వనభోజనాలు చేసిన తీరంలో ఆహ్లాదంగా గడిపారు. మెరైన్ పోలీసులు బందోబస్తు ఏర్పాట్లు చేశారు. పర్యాటకులు అధిక సంఖ్యలో రావడంతో ట్రాఫిక్ సమస్యలు ఏర్పడ్డాయి.


గార: మొగదాలపాడు బీచ్‌లో పోలీసుల బందోబస్తు

- గార: మొగదాలపాడు బీచ్‌లో ఆదివారం పర్యాటకుల సందడి కనిపించింది. జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన పలువురు కుటుంబాలతో పాటు విద్యార్థులు తరలివచ్చారు. ఉదయం నుంచి ఆట, పాటలతో సందడి సరదాగా గడిపారు. మధ్యాహ్నం సముద్ర స్నానాలు చేసి సందడి చేశారు. బీచ్‌లో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా మెరైన్ సీఐ బి.ప్రసాదరావు, గార సీఐ సీహెచ్ గంగరాజు, సిబ్బంది పర్యాటకులను అప్రమత్తం చేశారు. గస్తీ నిర్వహించి మైక్‌లో హెచ్చరికలు చేశారు.

వసతిగృహాల్లో మౌలిక వసతులు కల్పిస్తాం

- బీసీ సంక్షేమశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సత్యనారాయణ


నరసన్నపేట: విద్యార్థులతో మాట్లాడుతున్న సత్యనారాయణ

నరసన్నపేట/ పాతపట్నం, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): బీసీ సంక్షేమ వసతి గృహాలను ఆధునీకరించి అన్ని మౌలిక వసతులు పూర్తిస్థాయిలో కల్పిస్తామని బీసీ సంక్షేమశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సత్యనారాయణ తెలిపారు. ఆదివారం స్థానిక బాలికల వసతిగృహాన్ని ఆయన పరిశీలించి, విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. రాష్ట్రంలో అనంతపురం, సింహాచలం వపతిగృహాల్లో 240 మంది చొప్పున విద్యార్థులకు ఐఐటీపై శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు. వసతిగృహ విద్యార్థుల్లో మానసిక పరివర్తన, మనోధైర్యం పెంపొందించే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో బీసీ కార్పొరేషన్ ఈడీ గడ్డెమ్మ, జిల్లా బీసీ సంక్షేమ అధికారి అనురాధ పాల్గొన్నారు. అలాగే పాతపట్నం నీలమణిదుర్గ ఆలయాన్ని బీసీ సంక్షేమశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్.సత్యనారాయణ ఆదివారం దర్శించుకొన్నారు. ఆలయ కమిటీ చైర్మన్ అక్కంధ్ర సన్యాసిరావు, కమిటీ సభ్యులు డి.వెంకటరమణ దేవదాయశాఖ సిబ్బంది సాధారంగా ఆహ్వానించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి చిత్రపటాన్ని అందజేశారు.

36 ఏళ్ల తర్వాత కలుసుకుని..


1989లో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు

కాశీబుగ్గ, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): కాశీబుగ్గ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 1989లో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు ఆదివారం అనకాపల్లిలో కలుసుకున్నారు. 36 ఏళ్ల తర్వాత ఒక్కసారిగా చూసుకొని కలుసుకోవడం ఒకరినొకరు ఆత్మీయంగా హత్తుకొని ఆ నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా సందడిగా గడిపారు. చిన్ననాటి స్నేహితులందరూ కటుంబాలతో కలిసి ఆనందంగా పాల్గొని సందడి చేశారు. తహసీల్దార్ చిన్నికృష్ణ, ప్రొఫెసర్ మెట్ట సాయికుమార్, రమేష్, లీలాకుమారి, రవిప్రకాష్, వెంకటేష్ పాల్గొన్నారు.

ముగిసిన ఎన్‌ఎస్‌ఎస్ శిబిరం


నృత్యం చేస్తున్న ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు

వజ్రపుకొత్తూరు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): గోవిందపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్‌ఎస్‌ఎస్ శిబిరం ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ రమేష్ మాట్లాడుతూ.. ఈ నెల 1 నుంచి వివిధ సేవా కార్యక్రమాలు చేపట్టినట్టు తెలిపారు. హైస్కూల్, అంగన్‌వాడీ విద్యార్థులకు ఆటలు ఆడిపించి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు డ్యాన్స్‌లు చేస్తూ సందడి చేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ కేశవరావు, రమణ తదితరులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గోవిందరావు

మెళియాపుట్టి, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): విద్యాభివృద్ధికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేసిందని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు తెలిపారు. ఆదివారం చాపర జిల్లా పరిషత్ ఆవరణలో నిర్వహించిన యూటీఎఫ్ జిల్లా కౌన్సిల్ సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. గత వైసీపీ ప్రభుత్వం విద్యా వ్యవస్థను అస్తవ్యస్తం చేసిందన్నారు. నియోజకవర్గంలోని ప్రతి పాఠశాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా వివిధ అంశాలపై ఉపాధ్యాయులు తీర్మానాలు చేశారు. ఏకీకృత సర్వీస్ రూల్స్ చేయాలని, పదోన్నతలు కల్పించాలని డిమాండ్ చేశారు. 2010 కంటే ముందు నియమితులైన ఉపాధ్యాయులకు టెట్‌లో మినాహాయింపు ఇవ్వాలన్నారు. 12 పీఆర్సీ పుణరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డీఈవో అడారి రవిబాబు, డిప్యూటీ డీఈవో విలియమ్, యూటీఎఫ్ నాయకులు ఎం.వెంకటరమణ, కేఎస్ఎస్ ప్రసాద్, శ్రీరామూర్తి, గోంటి గిరిధర్, నీలకంఠ పాత్రో, రవికుమార్, రాజమోహన్, లక్ష్మీనారాయణ, గున్నయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సెంచూరియన్ స్నాతకోత్సవం


విద్యార్థులకు డిగ్రీ ప్రదానం చేస్తున్న గవర్నర్ హరిబాబు

పర్లాకిమిడి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఘనంగా సెంచూరియన్ వర్సిటీ స్నాతకోత్సవం ఆదివారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఒడిశా రాష్ట్ర గవర్నర్ కంభంపాటి హరిబాబు పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు కష్టపడి చదివితే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చన్నారు. విద్యార్థులు ఉద్యోగానికే పరిమితం కాకుండా ఉద్యోగ సృష్టికర్తలుగా తయారవ్వాలన్నారు. వర్సిటీలో అధికంగా పరిశోధనలకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ డీఆర్‌డీఏ డైరెక్టర్ జనరల్ వీకే దాస్, వర్సిటీ చైర్మన్ ముక్తాకాంత్ మిశ్ర, వైస్ చెర్మన్ డీఎన్ రావు, వైస్‌చాన్స్‌లర్ బిశ్వజిత్ మిశ్రా తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిగ్రీల పట్టాలను గవర్నర్ ప్రదానం చేశారు.

పోటీతత్వం అలవర్చుకోవాలి

మెళియాపుట్టి, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో పోటీతత్వాన్ని అలవర్చుకోవాలని ఎంఈవో పద్మానాభం తెలిపారు. ఆదివారం చాపర జిల్లా పరిషత్ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు వందరోజుల ప్లాన్‌లో భాగంగా ప్రత్యేక తరగతులు నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వ్యాసగీత, యూటీఎఫ్ రాష్ట్ర నాయకులు గొంటి గిరిధర్, స్వర్ణకుమారి, ధనలక్ష్మి, జె.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

- నందిగాం: రాష్ట్ర విద్యాశాఖ సూచనల మేరకు పదో తరగతి విద్యార్థులకు వందరోజుల ప్రణాళికలో భాగంగా ఉన్నత పాఠశాలలో ఆదివారం తరగతులు ప్రారంభమయ్యాయి. 14 ఉన్నత పాఠశాలలు, బాలికల గురుకులం, కేజీబీవీ, రెండు ఆశ్రమ పాఠశాలల్లో తరగతులు నిర్వహించారు. వెనుకబడ్డ విద్యార్థులకు ముందంజలో నిలబెట్టేందుకు ఈ ప్రక్రియ ఉపకరిస్తుందని ఉపాధ్యాయులు తెలిపారు. రెండో శనివారం, ఆదివారాల్లో నిర్వహించే తరగతుల్లో కూడా విద్యార్థులకు మధ్యాహ్న భోజన అమలు చేస్తున్నారు.

ప్రశాంతంగా ఎన్‌ఎంఎంఎస్ పరీక్షలు

పలాసరూరల్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): పలాస డివిజన్‌లో 8వ తరగతి విద్యార్థులకు ఆదివారం నిర్వహించిన ఎన్‌ఎంఎంఎస్ (నేషనల్ మీన్స్ కమ్ మెరిట స్కాలర్‌షిప్) పరీక్షలు ఆదివారం ప్రశాంతంగా జరిగాయి. పలాస డివిజన్‌కు సంబంధించి ఎనిమిది కేంద్రాల్లో 1696 మంది విద్యార్థులకు 1668 మంది విద్యార్థులు హాజరైనట్టు ఎంఈవో శ్రీనివాసరావు తెలిపారు. ఉదయం 10గంటల నుంచి 1గంట వరకు ఈ పరీక్ష జరిగింది. ఆయా కేంద్రాల వద్ద ప్రత్యేక పోలీసు బందోబస్తు, వైద్య సదుపాయం ఏర్పాటు చేశారు.

లారీ కిందకు దూసుకుపోయిన ద్విచక్ర వాహనం

- ఇద్దరికి తీవ్రగాయాలు


చికిత్స పొందుతున్న ఈశ్వరరావు
లారీకింద ఇరుకున్న బైక్

పలాస, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): పలాస బైపాస్ రోడ్డు శాసనం గ్రామం వద్ద ఆదివారం లారీ కిందకు ఓ ద్విచక్రవాహనం దూసుకుపోయిన ఘటన చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ఒ డిశాకు చెందిన ఇద్దరు యువకులు తీవ్ర గాయాలతో బయటపడ్డారు. వివరాల్లోకి వెళ్తే.. ఒడిశా రాష్ట్రం గజపతి జిల్లా అంతరసింగి గ్రామానికి చెందిన ఈశ్వరరావు, సునిల్‌కుమార్ ద్విచక్రవాహనంపై వస్తుండగా అదుపుతప్పి లారీ కిందకు దూసుకుపోయింది. ఈ ఘటనలో ఇద్దరూ రోడ్డుపై పడిపోవడంతో గాయాలతో బయటపడ్డారు. క్షతగాత్రులను 108 వాహనంలో పలాస ప్రభుత్వాసుపత్రికి తరలించగా.. మెరుగైన చికిత్స కోసం టెక్కలి ఏరియా ఆసుపత్రికి రిఫర్ చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ నర్సింహమూర్తి తెలిపారు.

లారీ డ్రైవర్‌కు తీవ్ర గాయాలు

కంచిలి, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): బూరగాం జంక్షన్ సమీపంలో జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్ పూర్ణమషి ధాకర్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వెస్ట్ బెంగాల్ రాష్ట్రం పరగనాస్ జిల్లాకు చెందిన పూర్ణమషి ధాకర్(52) రెడీమేడ్ దుస్తుల లోడ్‌తో ఇచ్ఛాపురం నుంచి పలాస వైపు వెళుతూ బూరగాం జంక్షన్ వద్ద లారీని ఆపి బహిర్భూమి కోసం రోడ్డు దాటుతుండగా అటుగా వచ్చిన మరో లారీ ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే క్షతగాత్రుడిని 108 వాహనంలో సోంపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం పరిస్థితి విషమించడంతో బరంపురం ఎంకేసీజీ హాస్పటల్‌కు తరలించినట్లు ఎస్‌ఐ పి.పారినాయుడు తెలిపారు.

రెండు పూరిళ్లు దగ్ధం

రణస్థలం, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): జీరుపాలెం గ్రామంలో ఆదివారం ఉదయం జరిగిన అగ్ని ప్రమాదంలో మైలపల్లి కొర్లమ్మ, మైలపల్లి చిలకమ్మలకు చెందిన పూరిళ్లు అగ్నికి ఆహుతయ్యాయి. విషయం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలు అదుపు చేశారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఈ ప్రమాదం జరిగిందని బాధితులు తెలిపారు. సుమారు రూ.2 లక్షల ఆస్తి నష్టం వాటిల్లినట్లు ప్రాథమిక అంచనా. బాధితులను మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితుడు పిన్నింటి సాయికుమార్ తదితరులు పరామర్శించి, ఆర్థిక సాయం చేశారు.

పూసర్లపాడులో గడ్డికుప్ప..


కాలిపోతున్న గడ్డికుప్ప

గార, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): పూసర్లపాడు గ్రామం వద్ద ఆదివారం ప్రమాదవశాత్తూ అగ్ని ప్రమాదం జరిగి రైతు గదిలి సురేష్‌కు చెందిన మూడున్నర ఎకరాల్లో నూర్చిన గడ్డికుప్ప దగ్ధమైంది. ఇటీవల వరిని నూర్చి కుప్పగా పెట్టారు. అయితే ప్రమాదం ఎలా జరిగిందో తెలియదు కాని వేలాది రూపాయల గడ్డి కాలిపోయిందని బాధితుడు తెలిపారు. తనను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాడు.

టెక్కలి వైసీపీ అభ్యర్థి తిలక్కే

- కృష్ణదాస్ వ్యాఖ్యలతో పార్టీశ్రేణుల్లో అయోమయం

టెక్కలి, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ఎప్పుడు ఎన్నికలు జరిగినా టెక్కలి నియోజకవర్గం నుంచి వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పేడాడ తిలక్కేనని, పార్టీలో ఇంకెవ్వరూ ఎమ్మెల్యే టిక్కెట్ కావాలని ఆశించవద్దని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్ అన్నారు. ఆదివారం దివంగత ఎమ్మెల్యే కొర్ల రేవతీపతి జయంతి కార్యక్రమంలో పాల్గొన్న కృష్ణదాస్ పైవిధంగా వ్యాఖ్యానించడంతో వైసీపీ శ్రేణులతోపాటు ఆశావహుల్లో అయోమయ పరిస్థితి నెలకొంది.

నవోదయ నమూనా పరీక్షకు స్పందన


నవోదయ పరీక్ష రాస్తున్న విద్యార్థులు

పాతపట్నం రూరల్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): నవోదయ నమూనా పరీక్షకు 52 మంది హాజరైనట్టు మెట్ట ఆంజనేయులు తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ జూనియర్ కళాశాలలో జవహర్ నవోదయ విద్యాలయం ఆరో తరగతిలోని ప్రవేశ పరీక్షకు నమూనా పరీక్ష నిర్వహించారు. మెళియాపుట్టి, పాతపట్నం, హిరమండలం మండలాల నుంచి విద్యార్థులు హాజరయ్యారు.

కాశీబుగ్గ సీఐగా రామకృష్ణ


రామకృష్ణను అభినందిస్తున్న టీడీపీ నాయకులు

పలాస, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): కాశీబుగ్గ సీఐగా వై.రామకృష్ణ ఆదివారం బాధ్యతలు చేపట్టారు. విజయనగరం పోలీసు శిక్షణ కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న రామకృష్ణ బదిలీపై ఇక్కడకు వచ్చారు. కాగా ఈయన 2013 నుంచి ఇక్కడ సీఐగా పనిచేశారు. అలాగే సీఐగా బాధ్యతలు చేప ట్టిన రామకృష్ణను రాష్ట్ర టీడీపీ బీసీసెల్ ప్రధాన కార్యదర్శి లొడగల కామేశ్వర రావు యాదవ్, నాయకులు గురిటి సూర్యనారాయణ, బడ్డ నాగరాజు, టంకాల రవిశంకర్ గుప్తా, కొత్త సత్యం, అంబటి కృష్ణమూర్తి, సవర రాంబాబు తదిత రులు మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు.

నిత్యావసర సరుకులు అందజేత


డోకులపాడులో సరుకులు పంపిణీ చేస్తున్న దృశ్యం

వజ్రపుకొత్తూరు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో మత్స్యకారులు చేపలు వేటకు వెళ్లలేకపోవడంతో రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా అందించిన రేషన్ సరుకులను ఆదివారం గ్రామాల్లో పంపిణీ చేశారు. 50 కిలోల బియ్యంతో పాటు నూనే, కందిపప్పు, దుంపలు, ఉల్లిపాయలు గోదుమపిండి ప్రతి మత్స్యకార కుటుంబానికి అందేలా ఆదేశాలు ఉండడంతో గ్రామాల్లో సరుకుల పంపిణీతో డీలర్లు బిజిబిజీగా ఉన్నారు.

తాగునీరు అందించండి

పలాసరూరల్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): దానగొర, హిమగిరి గ్రామాల్లో తాగునీరు సరఫరా రెండు రోజులుగా లేకపోవడంతో గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. పైపుల లీకేజీ వలన సరైన సమయానికి తాగునీరు రాకపోవడంతో ఇతర ప్రత్యామ్నాయాల ద్వారా తీసుకురావాల్సి వస్తుందని గ్రామస్థులు వాపోయారు. పైపుల లీకేజీని సకాలంలో సరి చేయకపోవడంతో దూర ప్రాంతాల నుంచి తాగునీరు తీసుకురావాల్సి వస్తుందని, ఇప్పటికైనా తాగునీరును సకాలంలో అందించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

చైతన్యపరచాలి

టెక్కలి, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): హిందూ సమాజాన్ని చైతన్యపరచాల్సిన సమయం ఆసన్నమైందని నంధ్యాల ప్రాంతానికి చెందిన ఆర్‌ఎస్‌ఎస్ ప్రచారక్ మనోహర్ అన్నారు. ఆదివారం స్థానిక యోగా భవన్‌లో జరిగిన హిందూ సమ్మేళనంలో ఆయన పాల్గొని మాట్లాడారు. దేశంలో హిందూ ధర్మం, హిందూ సంస్కృతి ఎంతైనా అవసరమన్నారు. హిందూ సమ్మేళనం ఏర్పాటుకు అందరూ సహకరించాలని కోరారు. సమావేశంలో పాండవులమెట్ట పీఠాధిపతి నిరంజన్ గిరిబాబా, చంద్రశేఖర్ పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ తప్పనిసరి

పాతపట్నం/రూరల్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): హెల్మెట్ ప్రతి ఒక్కరూ ధరించాలని ఎస్‌ఐ మధుసూదనరావు తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలోని ఆంధ్రా, ఒడిశా సరిహద్దు ప్రాంతంలో గల చెక్‌పోస్టు వద్ద సాధారణంగా వాహనాలు తనిఖీ చేశారు. ఆయన హెల్మెట్ ధరించని వారికి, వాహనానికి సంబంధిత పేపర్లు, లైసెన్స్ లేని వాహనదారులకు ఫైన్ విధించారు. సుమారు 34 మంది వాహనదారులకు అపరాధ రుసుం విధించినట్టు ఎస్‌ఐ తెలిపారు.

రాష్ట్ర సాఫ్ట్‌టెన్నిస్ జట్టు కోచ్‌గా సుజాత


కోచ్‌గా ఎంపికైన సుజాత

హిరమండలం, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సాఫ్ట్‌టెన్నిస్ జట్టు కోచ్‌గా వ్యాయామ ఉపాధ్యాయురాలు ఎస్.సుజాత ఎంపికయ్యారు. ఈవె గులుమూరు పాఠశాలలో పనిచేస్తున్నారు. 69వ స్కూల్ గేమ్స్‌లో భాగంగా జాతీయ స్థాయి పోటీలు మధ్యప్రదేశ్‌లోని దివాస్‌లో ఈ నెల 11 నుంచి 14వ తేదీ వరకు జరగనున్నాయి. ఈ పోటీల్లో పాల్గొనే రాష్ట్ర జట్టుకు కోచ్‌గా సుజాత వ్యవహరించనున్నారు. ఈమె నియామకంపై ఉపాధ్యాయులు, తదితరులు అభినందనలు తెలిపారు.

టెన్త్ విద్యార్థులకు తరగతులు

పాతపట్నం, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాల సాధనకై రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన వందరోజుల కార్యాచరణ ప్రణాళిక అమలులో భాగంగా మండల వ్యాప్తంగా సర్కారీ బడిలో 10వ తరగతి విద్యార్థులకు ఇంగ్లీష్ సాంఘిక పరీక్షలను నిర్వహించారు. అలాగే విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని ఏర్పాటు చేశారు. ఆదివారం కూడా విద్యార్థులకు పరీక్షలు నిర్వాహణ బోధనలపై ప్రత్యేక దృష్టి సారించడంపై విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా మంచి ఫలితాలు సాధించాలనే ఆశాభావాన్ని ఉపాధ్యాయలు వ్యక్తం చేస్తున్నారు.

ఇంకా వారమే!

(ఐదో పేజీ తరువాయి)

గడువు ఉండడంతో దరఖాస్తులు పెరిగే అవకాశం ఉంది. వైసీపీ ప్రభుత్వ హయాంలో జగనన్న కాలనీ లేఅవుట్ల పేరిట నివాసయోగ్యం కాని ప్రాంతాల్లో ఇళ్ల స్థలాలను మంజూరు చేశారు. దీంతో లబ్ధిదారులు ఇళ్లు కట్టేందుకు ముందుకు రాలేదు. అందుకే ఈసారి అర్హత, ఆసక్తి ఉన్న వారికి మాత్రమే ఇళ్లను మంజూరు చేయనున్నారు.

దరఖాస్తుల తిరస్కరణ..

గత ప్రభుత్వాల హయాంలో గృహాలు మంజూరైన వారి దరఖాస్తులు తిరస్కరణకు గురవుతున్నాయి. ఇటువంటి వారు జిల్లావ్యాప్తంగా వేలాది మంది ఉన్నారు. 2014లో అధికారంలోకి వచ్చిన టీడీపీ ఎన్టీఆర్ గృహనిర్మాణ పథకం కింద ఇళ్లు మంజూరు చేసింది. 2018 వరకూ బిల్లులు బాగానే చెల్లించినా.. తరువాత కేవలం ఖాతాలో రూ.1 మాత్రమే పడింది. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం వీటి గురించి పట్టించుకోలేదు. వైసీపీ హయాంలో సైతం చాలా మందికి లబ్ధిదారుల ఖాతాల్లో మాత్రం నిధులు జమ కాలేదు. బిల్లులు రాకపోగా.. తాజాగా దరఖాస్తులు చేసుకుంటే తిరస్కరణకు గురవుతున్నాయి. మరోవైపు గత ప్రభుత్వ హయాంలో జగనన్నకాలనీల పేరుతో లబ్ధిదారులకు సెంటు స్థలం ఇచ్చిన సంగతి తెలిసిందే. కానీ చాలామందికి పట్టాలిచ్చి ఆ స్థలాలు ఎక్కడున్నాయో చూపలేదు. అటువంటి వారి దరఖాస్తులు సైతం తిరస్కరణకు గురవుతున్నాయి. దీంతో వారికి ఆందోళన తప్పడం లేదు.

చురుగ్గా ప్రక్రియ

జిల్లాలో ఇళ్ల దరఖాస్తులకు సంబంధించి దరఖాస్తు ప్రక్రియ చురుగ్గా జరుగుతోంది. గత నెల 30తో దరఖాస్తు గడువు ముగిసింది. కానీ ప్రభుత్వం గడువు పెంచింది. ఈ నెల 14 వరకూ అవకాశం ఇచ్చింది. ప్రతి దరఖాస్తునూ ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సచివాలయ సిబ్బందిని ఆదేశించాం.

- బి.రమాకాంతరావు,
గృహనిర్మాణ శాఖ అధికారి, శ్రీకాకుళం

దివ్యాంగుల జీవితాల్లో వెలుగులు

(ఐదో పేజీ తరువాయి)

ఖరీదైన, ఆధునిక పరికరాలను అందిస్తున్నారు. ముఖ్యంగా 343 బ్యాటరీ ఆపరేటెడ్ ట్రైసైకిళ్ల కోసం ఏకంగా రూ.2.05 కోట్లు వెచ్చించారు. 54 జాయ్‌స్టిక్ వీల్ చైర్స్‌కు రూ.38.88 లక్షలు కేటాయించారు. 270 డిజిటల్ హియరింగ్ ఎయిడ్స్, స్మార్ట్‌ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు వంటివి కూడా పంపిణీ చేయనున్నారు. 'ఎయిర్ పోర్ట్ అథారిటీస్ ఆఫ్ ఇండియా' నిధులతోపాటు రాష్ట్ర కార్పొరేషన్ ద్వారా కూడా బడ్జెట్‌ను రూ.7లక్షలు(2023-24) నుంచి రూ.10.32 లక్షలకు(2025-26)పెంచి వృద్ధులకు, విద్యార్థులకు అండగా నిలుస్తున్నారు. ఇటీవల కొంతమంది దివ్యాంగులకు పరికరాలు అందజేయగా వారిలో ఆనందం వ్యక్తమైంది.